
సిద్దిపేట: జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట: జడ్పీ కార్యాలయంలో... రోజాశర్మ

సిద్దిపేట: కలెక్టరేట్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

ముప్పన్నెల సంబురం

ఘనంగా గణతంత్ర వేడుకలు

- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేసి జనగణమన ఆలపించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణాలతో వచ్చి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ జాతీయ జెండాను ఎగురవేశారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, హుస్నాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్, దుబ్బాకలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్త ప్రభాకర్‌రెడ్డి త్రివర్ణపతాకాన్ని ఎగురవేసి జాతీయగీతం ఆలపించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

– నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్, జనవరి 26


దుబ్బాక: చిన్నారులతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్

హుస్నాబాద్‌టౌన్: గాంధీ విగ్రహం వద్ద జాతీయజెండాను ఎగురవేస్తున్న మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న


హుస్నాబాద్: జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్

గజ్వేల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా ఎగరవేస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి


గజ్వేల్‌అర్బన్: కోర్టు ఆవరణలో గణతంత్ర వేడుకల్లో జడ్జి ప్రియాంక


కొమురవెల్లి: స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు

కుకునూర్‌పల్లిలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు

తొగుట పోలీస్‌స్టేషన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన సీఐ కమలాకర్

సిద్దిపేటలో శాఖాహారుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

శాఖాహారంతో ఆరోగ్యం పదిలం

- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 26: శాఖాహారంతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట కొండమల్లయ్య గార్డెన్‌లో శాఖాహారుల మెగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఆలోచన వెనుక సైన్స్ ఉంటుందని, శాఖాహారం వెనుక కూడా సైన్స్ ఉన్నదన్నారు. శాఖాహారులు పెరగాలని చేస్తున్న కార్యక్రమంపై అభినందనలు తెలిపారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు.

అదృష్టవంతుడివి అరవింద్

అరవింద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 26: అయోధ్య ప్రత్యేక అతిథి డాక్టర్ అరవింద్‌కు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠలో పాల్గొని వచ్చిన సిద్దిపేటకు చెందిన ప్రముఖ దంతవైద్యుడు డాక్టర్ అరవింద్ శుక్రవారం హరీశ్‌రావును కలిశారు. అయోధ్యలో స్వీకరించిన సీతారాముల ప్రతిమ, ప్రసాదాన్ని హరీశ్‌రావుకు అందజేశారు.

వరిలో మొగి పురుగును నివారించాలి

సిద్దిపేట కమాన్, జనవరి 26: వరి పంటను మొగి పురుగు నుంచి కాపాడడానికి వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సూచించారు. సిద్దిపేట జిల్లా వ్యవసాయ అధికారి, నియోజకవర్గ వ్యవసాయ అధికారులు, రైతులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో వరిసాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. మొగి పురుగు, ఇతర చీడల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సమ్మక్క-సారలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 26: ధూళిమిట్ట మండలంలోని కూటిగల్ సమ్మక్క-సారలమ్మ జాతర వాల్‌పోస్టర్‌ను శుక్రవారం జనగామ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన సమ్మక్క-సారలమ్మల జాతరను విజయవంతం చేయాలన్నారు. గద్దెల ప్రాంగణంలో చేపట్టే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వలబోజు నారాయణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీరాముల సత్తయ్య, మాజీ సర్పంచ్ నల్ల నిర్మలామహేందర్, జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ ధరావత్ గద్దర్‌నాయక్, కార్యదర్శి పల్లె యాదయ్య, నాయకులు దాసారం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి సద్గురు సదనం వార్షికోత్సవాలు

చేర్యాల, జనవరి 26: పట్టణంలోని శృంగేరీ నగర్‌లోని సద్గురు సదనంలో 27, 28 తేదీల్లో ఆదిశంకరమూర్తి ప్రతిష్ఠాపన తృతీయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్ల సద్గురు సదనం ప్రతినిధులు తెలిపారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ 27న అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి ఆదిశంకర మందిరం వరకు శోభాయాత్ర(పల్లకీ సేవ) ఉంటుందన్నారు. 28న మహాన్యాస పూర్వక శతరుద్రాభిషేకం, పూజలు ఉంటాయన్నారు. అభిషేకంలో పాల్గొనాలనుకునే భక్తులు సంప్రదాయ దుస్తులతో ఉదయం 7.30గంటలకు సద్గురు సదనంలో ఉండాలన్నారు.

జాలపల్లిలో పంచాయతీ సభ్యులు, సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్

పంచాయతీ సభ్యులకు సన్మానం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 26: ధూళిమిట్ట మండలంలోని జాలపల్లిలో పంచాయతీ పాలకవర్గ సభ్యుల పదవీకాలం ముగియడంతో వార్డు సభ్యులతో పాటు పంచాయతీ సిబ్బందిని సర్పంచ్ చొప్పరి వరలక్ష్మీసాగర్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐదేండ్ల కాలంలో గ్రామ అభివృద్ధిలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెట్కూరి కల్యాణికమలాకర్, ఉపసర్పంచ్ రాగుల సంపత్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జగదేవ్‌పూర్, జనవరి 26: ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని ఆర్థిక వృద్ధి సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో దౌలాపూర్ గ్రామానికి రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా 12 మంది లబ్ధిదారులకు గొర్రెల పెంపకానికి అవసరమయ్యే మందులు అందించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శ్వేత, వీఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు ఐలయ్య, కరుణాకర్, నవీన్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
★I, Yooradi Srinivas S/o. Vuradi Badraiah, R/o. H.No. 2-1-174/1, N.G.O's Colony, Zahirabad Town & Mandal, Sangareddy District, T.S. I have changed my name to Vuradi Srinivas.
NT-313807
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

న్యాయ సహాయం అందించాలి

సిద్దిపేట టౌన్, జనవరి 26: జైలు జీవితం అనుభవిస్తున్న బాల నేరస్తులకు న్యాయ సహాయం అందించాలని సిద్దిపేట జిల్లా సీనియర్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. సిద్దిపేట న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో బాలనేరస్తులను గుర్తించడం, వారికి న్యాయ సహాయం అందిచాలనే అంశంపై న్యాయవాదులకు అవగాహన కల్పించారు.

పల్లె ప్రకృతి వనం ఆక్రమణ!

చేర్యాల, జనవరి 26: మండంలోని కాశిగుడిసెల పంచాయతీకి చెందిన పల్లె ప్రకృతి వనంలో మొక్కలను ధ్వంసం చేసి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పంచాయతీ కార్యదర్శి ఇస్లావత్ తిరుపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీకి రెవెన్యూ అధికారులు కేటాయించిన భూమిలో పల్లె ప్రకృతివనం ఏర్పాటుచేసి అందులో 2020లో మొక్కలు నాటారు. 2022 మార్చి 5న ఆకునూరుకు చెందిన పలువురు వ్యక్తులు అందులో 70 మొక్కలను అకారణంగా నరికివేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు హెచ్చరించి వెళ్లారు. అయినా మరోసారి 10 మొక్కలు నరికివేసి తాత్కాలికంగా గుడిసెలు వేసి భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తే పంచాయతీ పాలకవర్గం తహసీల్దార్, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గుడిసెలను తొలిగించాలని ఆదేశించారు. మరోసారి ఈనెల 25న 800 పెద్ద మొక్కలను పూర్తిగా నరికివేసి సంబంధిత భూమిని ఆక్రమించుకున్నారని, ఈ ఘటనలో రూ.2లక్షల మేర ఆస్తినష్టం జరిగిందని, భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. వెంటనే విచారణ జరిపించాలని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి

సిద్దిపేట, జనవరి 26: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు రాజ్యాంగాన్ని పరిరక్షించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, శ్రీనివాస్‌గౌడ్, కిరణ్, చల్లా రపు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ అవార్డు గ్రహీతకు సన్మానం


ఇన్నోవేషన్ అవార్డు గ్రహీత అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ లలితాకృష్ణారెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 26: మద్దూరు మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన ఇన్నోవేషన్ అవార్డు గ్రహీత శామంతుల అనిల్‌కుమార్‌ను శుక్రవారం సర్పంచ్ బద్దిపడిగె లలితాకృష్ణారెడ్డి శాలువాతో సన్మానించారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్(టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఇన్నోవేషన్ కార్యక్రమంలో శామంతుల అనిల్‌కుమార్ ప్యాడీ స్ప్రింగ్ వీడర్ పరికరాన్ని ఆవిష్కరించి బెస్ట్ ఇన్నోవేటర్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతల ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగల దోపిడీ.. ఆపై హత్య!

శ్యామల (ఫైల్)
వివరాలు తెలుసుకుంటున్న సీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్

- కొల్గూరులో ఘటన.. పరిశీలించిన సీపీ అనురాధ

గజ్వేల్, జనవరి 26: మండల పరిధిలోని కొల్గూర్‌లో దారుణం జరిగింది. చోరీకి వచ్చిన దుండగుడు మహిళ మెడపై బంగారు ఆభరణాలను తీసుకొని ముఖంపై దిండుపెట్టి హత్య చేశాడు. ఈ దారుణం శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెన్న శ్యామల(55) తెల్లవారుజామున 5.30కు ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూం వెళ్లింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి వెళ్లి శ్యామల భర్త శ్రీనివాస్ పడుకున్న గదికి గొళ్లెం పెట్టాడు. శ్యామల బాత్‌రూం నుంచి బయటకు వచ్చే సమయంలో ఆగంతకుడు ఆమె ముఖంపై దిండుతో గట్టిగా వొత్తిపట్టుకోవడంతో స్పృహ తప్పింది. వెంటనే ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడు, అరతులం చెవికమ్మలు తీసుకొని పారిపోయాడు. ఈ క్రమంలో ఆమెకు గాయమైంది. 15 నిమిషాల తర్వాత తేరుకున్న శ్యామల భర్త పడుకున్న బెడ్‌రూం గడియ తీసి భర్తకు, చుట్టుపక్కల వారికి విషయం చెప్పింది. గాయమైన శ్యామలను ప్రథమ చికిత్స కోసం గజ్వేల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మరో దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందింది. భర్త శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని గజ్వేల్ ఏసీపీ రమేశ్, సీఐ జాన్‌రెడ్డిల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. కేసును త్వరగా ఛేదించాలని గజ్వేల్ ఏసీపీ, సీఐకి ఆదేశించారు. ఆగంతకుడిని పట్టుకునేందుకు గ్రామంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ హత్యకు గురైన శ్యామల ఇంటి నుంచి గ్రామ శివారుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరాయి. క్లూస్ టీం దిండుపై ఉన్న నిందితుడి వేలిముద్రలను సేకరించారు. శ్యామల హత్యకేసును త్వరలోనే ఛేదిస్తామని ఏసీపీ రమేశ్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామిలు గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కూడవెల్లి జాతరకు ఏర్పాట్లు చేయాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 26: దక్షిణ కాశీగా పేరొందిన కూడవెల్లి రామలింగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మాఘ అమవ్యాస సందర్భంగా కూడవెల్లి జాతర ఐదు రోజులు కొనసాగుతుంది. శుక్రవారం కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ అమావాస్యకు ఆలయం వద్ద నిర్వహించే జాతరకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయంలో స్వామివారి దర్శనం, వాగులో పుణ్య స్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆలయ కమిటీ, సిబ్బందికి సూచించారు. పోలీసు, ఆలయ సిబ్బంది జాతర ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనం ప్రారంభం

దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లిలో రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కైలాశ్, సర్పంచ్, కూడవెల్లి ఆలయ చైర్మన్ పూజల చంద్రం, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కిషన్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

రాయపోల్, జనవరి 26: గ్రామాల అభివృద్ధే లక్ష్యమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాటలో వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం బీడీ కార్మికుల, కుమ్మరి శాలివాహన భవనాల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. గ్రామంలో ఐమాక్స్ లైట్లను, పంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూజిత, ఉపసర్పంచ్ సింహాచలం, ఎంపీటీపీ లక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మండల కోఆప్షన్ సభ్యుడు హైమద్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

క్రీడలతో మానసికోల్లాసం

సిద్దిపేట టౌన్, జనవరి 26: నిరంతరం బిజీగా ఉండే జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా వారిలో మానసికోల్లాసం కలగడంతో పాటు తోటి జర్నలిస్టులతో స్నేహభావం పెంపొందుతుందని సిద్దిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగాచారి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో వంద మందికి పైగా జర్నలిస్టులు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టులు రాజిరెడ్డి, కత్తుల శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి రంగాచారి బహుమతులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ పత్రికలు, మీడియాలో పనిచేస్తూ నిరంతరం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు క్రీడా పోటీలు ఆటవిడుపు వంటివన్నారు. ఇక నుంచి ప్రతి ఏడాది ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బబ్బురి రాజు, అయిత శ్రీనివాస్, రఘు, మజ్జు, సంజీవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సతీశ్ పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రంగాచారి, జర్నలిస్టులు శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి